# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 2, డిసెంబరు, 2014

విద్యుత్ శాఖలోని జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం ఉద్యోగులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన వేతన సవరణ చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన విద్యుత్ ఉద్యోగుల విషయంలో ప్రభుత్వం అత్యంత ఉదారతతో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణకు సంబంధించి సచివాలయంలో మంగళవారం సమీక్ష జరిగింది. జెన్‌కో ఛైర్మన్ డి.ప్రభాకర్‌రావు, విద్యుత్ శాఖ కార్యదర్శి ఎస్‌కె.జోషి, సిపిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి, విద్యుత్ ఉద్యోగ సంఘాల నాయకులు శివాజి, రామిరెడ్డి, మోహన్‌రెడ్డి, సుధాకర్ రావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకుల ప్రతిపాదనలను పరిశీలించి సానుకూలంగా స్పందించారు. 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వడం అత్యంత సముచితమని ముఖ్యమంత్రి అన్నారు. 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మూడు ఇంక్రిమెంట్లు, 15 సంవత్సరాల లోపు సర్వీసు ఉన్న ఉద్యోగులకు రెండు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పట్ల విద్యుత్ శాఖ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలోని పెన్షనర్లకు కూడా 30 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పెన్షన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ప్రస్తుతం విద్యుత్ శాఖలో 26,894 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి రూ. 1233 కోట్ల జీతాలు చెల్లిస్తున్నారు. తాజా ఫిట్‌మెంట్ ప్రకారం రూ. 500 కోట్ల అదనపు భారం పడుతుంది. 19,292 మంది పెన్షనర్లకు ప్రస్తుతం రూ. 583 కోట్ల మేర పెన్షన్లు ఇస్తున్నారు. సవరించిన వేతనాల వల్ల ప్రభుత్వానికి రూ. 100 కోట్ల అదనపు భారం పడుతుంది. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, అదే

సమయంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు కూడా అంకిత భావంతో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో చూపించిన చొరవ, చైతన్యాన్ని పునర్నిర్మాణంలో కూడా చూపించాలని, తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ఉద్యోగులదే ముఖ్యమైన పాత్ర అని సిఎం అన్నారు. తనకు ప్రభుత్వ ఉద్యోగుల పైన ఎంతో నమ్మకం ఉందని, అందుకే విద్యుత్ ఉత్పత్తి రంగంలో ప్రైవేటు వారి భాగస్వామ్యాన్ని పూర్తిగా తగ్గించామని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి రంగాన్ని పెద్ద ఎత్తున విస్తరిస్తున్నామని, విద్యుత్ సరఫరాలో కూడా మెరుగుదల చూపాలని అన్నారు. అంతర్గత సామర్థ్యాన్ని పెంచుకొని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రతిష్టను పెంచాలని కోరారు.

------------------------------------------------

సిపిఆర్ఓ టు సిఎం